## ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌గర్ బ్యూరో, మే 14 ప్రభాతవార్త :** ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి అని ఎంసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ పట్టణానికి చెందిన రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంసెట్ అగ్రికల్చర్ మరియు ఇంజనీరింగ్ విభాగంలలో అద్భుతమైన ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే వారి క్యాంపు కార్యాలయంలో కళాశాల డైరెక్టర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అగ్రికల్చర్ విభాగంలో 73వ ర్యాంకు సాధించిన స్వర్ణకుమారిని, ఇంజనీరింగ్ విభాగంలో 1521 వ ర్యాంకు సాధించిన ప్రనీత్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే గారు ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం మోంట్ బేసిల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సిబిఎస్ఇ ఫలితాలలో 500 మార్కులకు గాను 492 మార్కులు సాధించిన ఎన్ సాయి శ్రీ చరణ్, 484 మార్కులు సాధించిన పి చేతన్ లను ఆయన ఘనంగా సన్మానించారు. వీరితో పాటుగా పదవ తరగతిలో (సిబిఎస్ఇ) ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థినీ విద్యార్థులను ఆయన ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చంద్రకళ వెంకటయ్య, డైరెక్టర్లు, శిరీష ప్రవీణ్ కుమార్, పూజిత మోహన్ రెడ్డి, సుశాంత్ కృష్ణ, ప్రిన్సిపాల్స్ భూపాల్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

## పూర్తి స్థాయిలో డయాలసిస్ సేవలు

**కిడ్నీ బాధితులకు ఇబ్బంది లేకుండా చేశాం**

**మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి**



డయాలసిస్ కేంద్రంలో రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి

**మక్తల్, మే 14 ప్రభాతవార్త :** మక్తల్ నియోజకవర్గంలో దాదాపు 100 మంది కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రోగులు డయాలసిస్ సేవల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారిని, దీన్ని దృష్టిలో ఉంచుకొని మక్తల్, ఆత్మకూరు పట్టణాలలో నూతనంగా డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించి వారి ఇబ్బందులను తొలగించామని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.కోటి 60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో రోగులకు పూర్తి స్థాయిలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో బుధవారం స్థానిక ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించారు. గతంలో డయాలసిస్ కేంద్రం అందుబాటులో లేక కిడ్నీ రోగులు డయాలసిస్ సేవల కోసం మహబూబ్‌నగర్, నారాయణపేట వంటి పట్టణాలకు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మక్తల్ పట్టణంలోనే డయాలసిస్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. త్వరలోనే మక్తల్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 150 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవికుమార్, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, వైద్యురాలు వినుత, నాయకులు కోళ్ల వెంకటేష్, కావలి తాయప్ప, ఆనంద్ గౌడ్, వల్లంపల్లి లక్ష్మణ్, కట్ట వెంకటేష్, బోయ వెంకటేష్, కల్లూరి గోవర్ధన్, గుంతలి రవి, షాలం, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## లారీల సమస్య లేకుండా చూడాలి



రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ అదనపు కలెక్టర్

**వనపర్తి టౌన్, మే 14 ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం తరలించేందుకు లారీల సమస్య లేకుండా చూడాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ మదనపూర్ గోదాము, ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి వరి కొనుగోలు కేంద్రం, ఆత్మకూరులో రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకం చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించడానికి అవసరమైన లారీలు పెట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేడిన వెంటనే లారీల్లో ట్రాన్స్పోర్ట్ చేసే విధంగా లారీలు పెట్టాలని ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో వచ్చిన వడ్లు తాలు, చెత్త లేకుండా చూసి సరైన తేమ వచ్చిన వెంటనే ధాన్యం తూకం వేయాలని, తూకం వేసిన వడ్లను వెంటనే మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఆత్మకూర్ అమరచింత మండలాల్లో ఎక్కడ కూడా రవాణా సమస్యలు లేకుండా రోజు 4 లారీలు పెట్టాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు తెచ్చిన వడ్లు పాడుకాకుండ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వడ్లపై టార్పాలిన్ కవర్లు కప్పాలని, వడ్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువ మంది హమాలీలను పెట్టి త్వరగా లోడ్ చేయాలనీ సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం శ్రీ లక్ష్మి ఆగ్రోటెక్ రైస్ మిల్‌ను తనిఖీ చేసారు. మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను త్వరగా అన్లోడే చేసి తిరిగి పంపించాలని మిల్లర్ యజమానిని ఆదేశించారు. తాలు పేరుతో తూకంలో అదనంగా కోతలు విధించరాదని ఆదేశించారు. ఆత్మకూరు తహసిల్దార్ చాంద్ పాషా, ఇతర అధికారులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

## కంబాలపురం గ్రామంలో మొసలి కలకలం

**శ్రీరంగాపూర్, మే 14 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల్ కంబాలపురం గ్రామంలో మంగళవారం రాత్రి 11 గం.ల సమయంలో నానమోని తెలుగు ఈశ్వర్‌ఇంటి దగ్గర ఒక మొసలి కనిపించింది. దానిని గమనించి కుక్కలు మొరగడంతో ఇంటి వారు చూడడం జరిగింది. వెంటనే ఫారెస్ట్ అధికా రులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. ఆ మొసలి దాదాపుగా 60 కేజీలు ఉండి మూడున్నర అడుగుల పొడవు ఉన్నది. ఫారెస్టు అధికారులు దానిని బంధించి సమీపన ఉన్న కృష్ణానదిలో వదిలి వేయడం జరిగిందని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నిఖిల్ రెడ్డి పేర్కొన్నారు.



మొసలిని పట్టుకున్న ఫారెస్టు అధికారులు

# రుణాల లక్ష్యాలను చేరుకోవాలి

- బ్యాంకర్ల మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం
- 2025-26 జిల్లా వార్షిక రుణప్రణాళిక విడుదల
- రూ.10,772.71కోట్ల కేటాయింపు




వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే14,ప్రభాతవార్త:** బ్యాంకర్లు ప్రజలకు అందించే రుణాల్లో నిర్దేశంచబడిన లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో 202425 ఆర్థిక సవత్సరంలో జరిగిన ప్రగతిపై బ్యాంకర్లతో డిసిసి, డిఎల్ఆర్‌సి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ 202425 ఆర్థిక సంవత్సరంలో 2025 మార్చి 31 ముగింపు నాటికి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక లో 8390.57 కోట్ల రుణ లక్ష్యం కు గాను 7223.68 కోట్ల రుణాలను మంజూరు చేసి 86.10 శాతం సాధించినట్లు తెలిపారు.. ఇందులో భాగంగా వ్యవసాయం మరియు వ్యవసాయ అనుబంధ రంగాలకు గాను రూ.3512 కోట్లు, ఎం.ఎస్.ఎం.ఈ రంగానికి 969 కో రుణాలను,ప్రాధాన్యత రంగానికి 4603 కోట్ల రూ.లు, ప్రాధాన్యేతర రంగాలకు 2121 కోట్ల రూ.లు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పి.ఎం.ఈ.జి.పి కింద యూనిట్‌లు స్థాపించడానికి అర్హులైన వారికి రుణాలు అందించాలని ఆదేశించారు.గత సంవత్సరం పెడింగ్‌లో ఉన్న దరఖాస్తులను బ్యాంకర్‌లు మంజూరు చేయాలని అన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఎస్.హెచ్.జి మహిళా సంఘాల సభ్యులకు వ్యక్తిగత,గ్రూప్ ద్వారా వివిధ కార్యకలాపాలకు బ్యాంక్‌ల ద్వారా రుణం మంజూరు చేయాలని కోరారు. జిల్లాకు నిర్ణయించిన ఆయా కార్యక్రమాల లక్ష్యం ప్రకారం రుణం మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో బ్యాంకర్లు, జిల్లా అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేసి జిల్లా అభివృద్ధి కోసం పని చేయాలన్నారు. వ్యవసాయ,ప్రాధాన్యత రంగాలకు ప్రాధాన్యత నివ్వాలని ఆమె సూచించారు.202526 జిల్లా వార్షిక రుణ ప్రణాళిక విడుదల సమావేశంలో 10,772 కోట్ల 71 లక్షల రూ.ల అంచనాతో రూపొందించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు 5906.93 కోట్ల రూ.లు,లీలీలీని రంగాలకు 2268 కోట్ల 95 లక్షల రూ.లు,ప్రాధాన్యత రంగాలకు 8353 కోట్ల 02 లక్షల రూ.లు కేటాయించినట్లు తెలిపారు. కార్ర్యమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కల్వ భాస్కర్, ఆర్బీఐ లీడ్ జిల్లా అధికారి ఎం.జడ్.రహమాన్, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ పి.షణ్ముఖ చారి, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న అధికారులు

## ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

**-ఇందిరా సౌర గిరి జల వికాస పథకం ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన...**

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మే 14 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంది రా సౌర గిరి జల వికాస పథకం ప్రారంభోత్సవ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పర్యవేక్షించారు. మే 18న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉపము ఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, గిరిజనుల స మగ్ర అభివృద్ధికి రూపుదిద్దుకున్న ఇందిరా సౌర గిరి జల వికాస పథకంను అధికారికంగా ప్రారం భించనున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో గిరిజనుల భూముల అభివృద్ధికి, సాగునీటి సదు పాయాల కల్పనకు, జీవ నోపాధి మెరుగుదలకు దోహదపడేలా రూ.12,600కోట్ల వ్యయంతో ఈ పథకం అమలు చేయనున్నారు. మొత్తం 6లక్షల ఎకరాల గిరిజన భూములు ఈ పథకానికి ఎంపి క కావడం ద్వారా ఇందిరా సౌర గిరి జల వికాస పథకం ద్వారా 2.10 లక్షల మంది గిరిజన రైతు లు లబ్ధిపొందనున్నారనని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గిరిజన ప్రజల సంక్షేమం కొరకు ప్రారంభించనున్న ఇందిరా సౌర గిరి జల వికాస పథకం యొక్క ఏర్పా ట్లను కలెక్టర్ పరిశీ లించారు. సభా వేదిక నిర్మాణ పనులు పర్యవేక్షి స్తూ కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలని, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. హెలిపాడ్ ఏ ర్పాట్లను పరిశీలించి, భద్రత ప్రమాణాలకు అను గుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిం చారు. ఇందిరా సౌర గిరి జల వికాస పథకం యొక్క లబ్ధిదారుల భూములలో వేయించిన బోర్ బావులను, సౌర విద్యుత్ ద్వారా బోరుబా వులకు పంపు సెట్లను ఏర్పాటును పరిశీలించా రు. బోర్ పంపులను స్టార్ట్ చేసి జలధారను పరిశీలించారు. చెంచు ప్రజల డీఎఫ్ఆర్ఓ పట్టా భూములలో ఏర్పాటు చేసిన మొక్కల గుంతలను వర్మీ కంపోస్టు ఎరువులతో నింపగా పరిశీలన చేశారు. డ్రిప్ పైపులను, స్పింకర్ల ఏర్పాటును పరిశీలించారు. రేపటి లోగా మొక్కలను నాటాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా సౌర గిరి జల వికాస పథకం విజయవంతంగా అమలయ్యేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని, అధికారులు కలసికట్టుగా పనిచేయాలని ఆదేశించారు. పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అన్ని ఏర్పాట్లు మే 17 లోగా పూర్తి చేయాలని, రేపటి లోగా మొక్కల నాటకం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ అధికారి చిన్న ఓబులేసు, డిపిఓ రామ్మోహన్ రావు, అచ్చంపేట ఆర్డీఓ మాధవి, ఉద్యానవన శాఖ అధికారులు వెంకటేశం, జగన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిణి హేమలత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

## విత్తన సీజన్

- రైతుకు జాగరూకత ఎంతో అవసరం
- నకిలీ(ల)తో జరభద్రం..
- రెండు నెలలు విత్తన,ఎరువుల విక్రయ దుకాణాల వద్ద జాతరే.. జాతర

**భూత్పూర్,మే 14,ప్రభాతవార్త :** ప్రతీ ఏటా ఎప్రిల్,మే వచ్చిందంటేచాలు విత్తన సీజన్ మొదలౌతుంది. ఆరుగాలం చమటోడ్చి తమ పొలాల్ని చదును చేసుకుని నాణ్యమైన విత్తనాల కోసం రైతు వేయి కళ్లతో ఎదురు చూస్తాడు. మే నెలలో విత్తన విక్రయ కేంద్రాల వద్ద రైతుల జాతర అగుపిస్తుంది. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు విక్రయదారులు నకిలీ విత్తనాలు రైతు నెత్తిన బెట్టి వేలకు వేలు డబ్బులు వసూలు చేస్తూ రైతుల్ని నిలువునా ముంచే అవకాశం లేకపోలేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం విత్తనాలు,ఎరువులు కొనుగోలు చేస్తున్న ప్రతి రైతు జాగురూకతతో వ్యవహరించాల్సిన అవసరమెంతైనా ఉందని పలువురు సూచిస్తున్నారు. ఏడాదిలో పన్నెండు నెలలుంటే ఇందులో మూడు నెలలు విత్తన అన్వేషణలో రైతులు పరిభ్రమిస్తున్నారు. మే,జూన్ నెలలు రైతులకు విత్తనాలు ముఖ్యంగా పత్తి విత్తనాలు నాటేందుకు అనువైనవిగా భావిస్తూ విత్తనాల కొనుగోలు కోసం విక్రయ కేంద్రాలకు ఎగబడుతుంటారు. విత్తన సీజన్‌లో విక్రయదారులు నాసిరకం కాకుండా నాణ్యమైన విత్తనాలు విక్రయించి తమ అధిక దిగుబడికి సహకరించాలని పలువురు రైతులు కోరుతున్నారు. మండలంలో దాదాపుగా ఐదు నుంచి పది వరకు ఎరువులు,విత్తనాల విక్రయ కేంద్రాలున్నాయి. సీజన్ కదా ఏవిచ్చినా రైతు కొంటాడనే స్వార్థాన్ని విడనాడి తమకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు విక్రయించి తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిజాయితీగా విత్తనాలు,ఎరువులు విక్రయించాలని రైతులు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

**కలెక్టర్ విజయేంద్ర బోయి**



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్

**నవాబుపేట,14 మే, ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దేపల్లి గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని, జాబితాలో అర్హులు మాత్రమే ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రజలతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న నీటిసమస్య వివరాలను అడిగి తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చౌడూరు గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు నీడ,తాగునీరు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె కొనుగోలు కేంద్రం ద్వారా ఇంతవరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, రైస్ మిల్లులకు తరలించిన వివరాలు,మద్దతు ధర చెల్లించిన వివరాలు మొదలగు అంశాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. లారీలు సమయానికి వస్తున్నాయా? రైస్ మిల్లర్లు సహకరిస్తున్నారా? అని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎంపీడీవో జయరాం నాయక్, ఎమ్మార్వో శ్రీనివాస్ ఎపీవో జ్యోతి, తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## మెడికల్ కళాశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్

**నారాయణపేట టౌన్, మే 14 ప్రభాతవార్త :** నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. మెడికల్ కళాశాల ఆవరణలో రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మించబోయే నర్సింగ్ కళాశాల కోసం స్థలాన్ని, అలాగే రూ. 24 కోట్లతో నిర్మించే ఎంసిహెచ్ మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్ స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఎంసిహెచ్, నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని టీజీఎం ఎస్ఐడీసీ ఈఈ రాజేందర్ ను ఆదేశించారు. అనంతరం మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల తరగతి గదులకు వెళ్లి తరగతుల నిర్వహణను పర్యవేక్షించారు. నర్సింగ్ విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. నర్సింగ్ కళాశాలలో ఏమైనా సమస్యలు ఇబ్బందులు ఉన్నాయా? అని విద్యార్థినులతో వాకబు చేశారు. కొందరు విద్యార్థినిలు భోజనం సరిగ్గా ఉండటం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కలెక్టర్ వంట ఏజెన్సీ వాళ్లతో మాట్లాడి నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థినులకు అందించేలా చర్యలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్‌కు సూచించారు. మిగతా జిల్లాలతో పోలిస్తే ఇక్కడ అత్యాధునిక వసతులతో కళాశాల భవనం ఉందని, ప్రారంభంలో కొంత ఇబ్బందులు ఉండడం మామూలేనని, కానీ వాటిని అధిగమించేందుకు అధికారులు కృషి చేస్తారని, మీరు మాత్రం చదువుపై ఎక్కువ దృష్టి పెట్టాలని కలెక్టర్ విద్యార్థినులకు సూచించారు. ఆ తర్వాత మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. రామ్ కిషన్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో మాట్లాడి కళాశాల నిర్వహణ, ఇంకా ఏమేమి అవసరం అనే అంశాలపై ఆమె చర్చించారు.



మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

**ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పరిశీలన :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఫిబ్రవరి 21న నారాయణపేట మండలం అప్పక్ పల్లి గ్రామంలో భూమి పూజ చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనులు ఇంకా బేస్ మెంట్ స్థాయిలోనే కొనసాగుతుండగా, నిర్మాణ పనులను వేగంగా చేయించాలని ఇంటి యజమానినీ, హౌసింగ్ పీడీ శంకర్‌ను ఆమె ఆదేశించారు. అలాగే అదే గ్రామంలో నిర్మిస్తున్న మరో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను కూడా కలెక్టర్ పరిశీలించి, తొందరగా పూర్తి చేయాలని సూచించారు. చివరగా కలెక్టర్ సింగారం చౌరస్తాలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించి, రోజుకు ఎన్ని లీటర్ల పెట్రోల్, డీజిల్ విక్రయం జరుగుతుందని? సిబ్బంది జీతాలు పోగా, నెలకు ఎంత లాభం వస్తుందనీ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చంద్ర కళను అడిగి తెలుసుకున్నారు. పెట్రోల్ బంక్ ఆర్థిక లావాదేవీల రికార్డులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో మొగులప్ప, డిజిఎంఎస్ ఐడిసిడి. ఈ కృష్ణమూర్తి, ఏఈ సాయి మురారి, ఎంపీడీవో సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## అపరేషన్ సింధూర్ విజయంతో తిరంగాయాత్ర



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షులు రామాంజనేయులు

**గద్వాల, మే 14,ప్రభాతవార్త:** భారత సైన్యం చేపట్టిన ఖిఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నుంచి 11 రోజుల పాటు ర్యాలీలు, తిరంగా యాత్ర చేపట్టనుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ యాత్ర ఈ నెల 23 వరకు కొనసాగనుందన్నారు. అందులో భాగంగా జోగులంబా గద్వాల జిల్లా కేంద్రంలో ముస్సిపాలిటీ లలో ఈ నెల 17వ తేదీన గద్వాల పట్టణ కేంద్రంలో,19 తేదీన అయిజ పట్టణంలో 20వ తేదీన వడ్డేపల్లి ముస్సిపాలిటీలో 21వ తేదీన అల్లంపూర్‌పట్టణ కేంద్రంలో తిరంగా యాత్ర ఉంటుంద న్నారు.. 17న గద్వాల పట్టణ కేంద్రంలో గద్వాల కోట నుండి పాతబస్టాండ్, క్రిష్ణ వేణి చౌక్, రాజీవ్ మార్గ్,వైఎస్సార్ చౌక్, కోటదగ్గర ర్యాలీ ముగుస్తుందన్నారు.ఈర్యాలీకి పార్టీలకు అతీతంగా,కుల మతాలకు అతీతంగా ఆర్ ఎస్ ఎస్, విహెచ్‌పి, భజరంగ్ దళ్, అందరూ హాజరై ఈయొక్క ర్యాలీని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండలవెంకట రాములు,మాజీ చైర్మన్ అక్కల రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే,గద్వాల పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహ, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ తదితరులు ఉన్నారు.

## తెలుగుదేశం పార్టీ మండల కమిటీ ఎన్నిక

**వీపనగండ్ల ,మే 14 ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల తెలుగుదేశం పార్టీ కమిటీని నూతనంగా బుధవారం నాడు ఎన్నుకున్నట్లు ఆ పార్టీ కొల్లాపూర్ తాత్కాలిక తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గద్ద బస్వాపురం సుధాకర్ నాయుడు తెలిపారు. ఆయన ఈ సందర్భంగా జర్నలిస్టులతో మాట్లాడుతూ తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఇప్పుడిప్పుడే పురుడు పోసుకుంటున్న సందర్భంగా ఆ పార్టీ ఇచ్చిన రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని మండలాల్లో గ్రామాలలో స్థానిక కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ కమిటీల ద్వారా ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల తరపునుండి పోరాటం నిర్వహిం చడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు అందులో భాగంగానే నూతనంగా కమిటీ లను వేయడం జరిగిందని వీపనగండ్ల మండల కమిటీ అధ్యక్షుడిగా.పి సతీష్ కుమార్ .ఉపాధ్య క్షునిగా నాగరాజు .ప్రధాన కార్యదర్శులుగా .రాంబాబు. గొల్ల ఆంజనేయులు కార్యనిర్వహక .కార్యదర్శులుగా.గోవుల బాలరాజు.రమేష్ యాదవ్.కార్యదర్శులు. తెలుగు శ్రీనివాసులు .బిచ్చన్న విశ్వనాయకు.కోశాధికారిగా.పి వెంకటేశ్వర్లును ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

## ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగను పంపిణీ చేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మే 14 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో "ఆర్ట్ ఆఫ్ గివింగ్" పేరుతో స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ అవరణలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణి కార్య క్రమం నిర్వహించారు. "నైబర్ గుడ్" అనే నినాదంతో ప్రొఫెసర్ అచ్యుత్ సమంత పిలుపుమేరకు తెలంగాణ వ్యాప్తంగాఅనేక సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరడంతో సేవ కార్యక్రమంలో భాగంగా కల్వకుర్తిలో మజ్జిగ పంపిణి కార్యక్రమం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ శివ కుమార్ మాట్లాడుతూ సమాజంలో నిరుపేదలకు సేవ చేయడం మా బాధ్యత అని, ప్రతి ఒక్కరిలో సామాజిక సేవను అలవాటు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. యువత సేవకార్యక్రమాలు చేయడం ద్వారాసామాజిక అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమం లో నాయకులు మొగిలి దుర్గా ప్రసాద్, ఆంజనేయులు, నర్సింహా, శివ రామ కృష్ణ,సేవ బృందం సభ్యులు సాయి కుమార్, లక్ష్మి నరసింహ, మణిదీప్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం పోలీసులు

**నారాయణపేట టౌన్, మే 14 ప్రభాతవార్త :** మహిళలను వేధిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని షీటీం పోలీసులు చెన్నయ్య అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు బుధవారం నారాయణపేట మండలం, కోటకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనీ సమ్మర్ క్యాంప్‌లో ఉన్న విద్యార్థులకు షిటీమ్ పోలీసులు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మహిళలను, చిన్నపిల్లలను వేధిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా షీటీం పోలీసులు చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. అందరూ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. మహిళలకు షి టీమ్ పోలీసులు అండగా ఉంటారని మహిళలను, విద్యార్థులను ఎవరైనా వేధించిన,శారీరకంగా మానసికంగా బాధపెట్టిన ధైర్యంగా షిటీమ్ పోలీసులకు నెంబర్ 8712670 398కి సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి చట్ట ప్రకారం వేధించినవారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఒకవేళ సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు షీ టీం పోలీసులు జ్యోతి, కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ప్రశాంత వాతావరణంలో ఉర్సు ఉత్సవాలు నిర్వహిద్దాం

■ జోగులాంబ గద్వాల ఆర్డిఓ శ్రీనివాసరావు



మత పెద్దలతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో

**అలంపూర్, మే 14 ప్రభాతవార్త :** ఈనెల 20 21 22 తేదీలలో అలంపూర్ మున్సిపాలిటీ లోని ప్రశాంత వాతావరణంలో ఉర్సు ఉత్సవాలు నిర్వహిద్దామని జోగులాంబ గద్వాల ఆర్డిఓ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రోజు అల్లంపూర్‌లోని తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ కుల సంఘాల పెద్దల సమక్షంలో ఆర్డిఓ మాట్లాడుతూ, షా అలీ పైల్వాన్ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకొని ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి అందరూ సహ కారంతో ఉర్సుఉత్సవాలను నిర్వహించుకోనేలా ప్రతి ఒక్కరు సహకరించాలని ఆర్డీవో తెలిపారు. ఎంతో పవిత్రంగా నిర్వహించుకునే ముస్లిం మత పెద్దలు, ఘనంగా నిర్వహించుకునే ఈ పండుగ వాతావరణం విజయవంతం చేసేలా కృషి చేయాలని ఆయన వారికి సూచించారు. హిందూ ముస్లిం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ షా అలీ పైల్వాన్ ఉర్సును, నిర్వహించుకోవాలని తెలిపారు.షాఅలీ ఫైల్ 1 ఊర్లో ఎలాంటి గొడవలు ప్రతి ఒక్కరు పోలీస్ సిబ్బందికి సహకరించాలని ఆలంపూర్ సీఐ రవిబాబు మత పెద్దలకు సూచించారు. మూడు రోజులపాటు జరిగే ఈషా అలీ పైల్వాన్ ఉర్సుఉత్సవాలు ఘనంగా జరుపుకునేటట్లు ప్రతి ఒక్కరు సహకరించాలని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మంజుల వివిధ మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తుల్జా భవాని ఉత్సవాలకు రండి



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ధర్మకర్త

**జడ్చర్ల, మే 14 ప్రభాతవార్త:** శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని ఆలయ రెండవ వార్షికోత్సవానికి రావాలంటూ ఆలయ ధర్మకర్త ఆహ్వానం పలికారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆలయ ధర్మ కర్త తిరుపతి పురపాలక ఛైర్పర్సన్ కోనేటి పుష్పలత కు కౌన్సిలర్స్ కుమ్మరి రాజు, సుంకసారి రమేష్ కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

# ధాన్యం సేకరణను అధికారులు నిశితంగా పర్యవేక్షణ చేయాలి

■ ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి

■ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

■ వనపట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 14 ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల ద్వారా వరిధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండలం వనపట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు,మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ధాన్యం అమ్మకాల వివరాలతో కూడిన రసీదులు అందిస్తున్నారా అని ఆరా తీశారు. వనపట్ల గ్రామంలో గల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లలో ఒకింత జాప్యం జరుగుతోందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా కేంద్రం నిర్వాహకుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు సమకూరుస్తున్న ప్పటికీ ధాన్యం సేకరణలో ఎందుకు జాప్యం జరుగుతోందని నిలదీ శారు. కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సొసైటీలకు వచ్చే సీజన్‌లో కేంద్రాలను కేటాయించకూడదని కలెక్టర్ పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకూడదని, కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యాతా ప్రమాణాలను పరిశీలించి తూకం వేయాలని నిర్వాహకు లను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే నిర్దేశిత మిల్లులకు తరలించాలని, లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. మిల్లుల వద్ద మిల్లర్లు సకాలంలో ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి

● న్యాయ సేవాధికార సంస్థ సలహాలు తీసుకోవాలి

● రైతులకు అక్షరాస్యత అత్యంతావసరం

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిర





భూత్పూర్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జీ డి ఇందిర

**భూత్పూర్,మే14,ప్రభాతవార్త:** రైతులు,ప్రజాప్రతినిధులు, అధికారులు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని,న్యాయ సంబంధ అంశాలపై ఎప్పటికప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సలహాలు,సూచనలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి,సీనియర్ సివిల్ జడ్జి డిఇందిర స్పష్టం చేశారు. బుధవారం భూత్పూర్ మండల పరిషత్ సమావేశం హాల్‌లో ఏర్పాటైన లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి డి ఇందిర ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భం గా జడ్జి ఇందిర మాట్లాడుతూ రైతులు అక్షరాస్యులుగా ఉంటేనే చట్టాలపై అవగాహన ఉంటుందని,నిరక్షరాస్యత వల్ల తమ విలువైన సమయాన్ని కోర్టుల చుట్టూ,పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగేందుకు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు.చట్టాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని,మండల స్థాయిలో మండల లీగల్ సెల్ అథారిటిఉంటుందని అన్నారు.రాష్ట్ర న్యాయశాఖ కల్పిస్తున్న పౌర న్యాయ సేవను రైతులు,ప్రజాప్రతినిధులు,అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి డిఇందిర సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రవి కుమార్ యాదవ్‌తోపాటు న్యాయవాదులు మాలిష్ షాకీర్, యోగేశ్వర్ యాదవ్‌లతో పాటు మండల రెవెన్యూ అధికారిణి జయలక్ష్మి,ఎంపిడిఓ ప్రభాకర్‌చారి,మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్,భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ ఇతర అధికారులు,ప్రజాప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు

■ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ఆత్మకూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**ఆత్మకూర్, మే14, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న విజయాన్ని గుర్తించి రైతులకు మిల్లర్లు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల యజమానులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అలాకానిపక్షంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలకు గురికావాల్సి వస్తుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం రోజు ఆత్మకూరు మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆయన పలు విషయాలపై మాట్లాడారు .ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ మరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా గన్ని బ్యాగులు తదితర వాటిపై జిల్లా ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూనే రైతులకు అండగా నిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో స్థానికంగా కూడా అధికారులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల యజమానులు రైతులకు సంబంధించిన వరి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేసే వరకు అశ్రద్ధ వహించకుండా రైతులకు మేలు చేసే విధంగా వివరించాలని ఆయన సూచించారు అంతేకాకుండా రైస్ మిల్లులలో నిలువ ఉన్న పరిధాన్యాన్ని పరిశీలించిపలు విషయాలపై తగు సూచనలు చేశారు అడిషనల్ కలెక్టర్ వెంబడి స్థానిక తహసిల్దార్ రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

*కిలో వరితాలను 60 రూపాయలకు అమ్ముకుంటూ..*

## రైతుల నోట్లో మట్టి కొడుతున్న రైస్ మిల్లర్లు

■ వనపర్తి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మేకల ఆంజనేయులు



రైతులతో మాట్లాడుతున్న వనపర్తి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆంజనేయులు

**వీపనగండ్ల, మే14 ప్రభాతవార్త:** కేజీ వరి తాలూకు 60 రూపాయల చొప్పున రైస్ మిల్లర్లు అమ్ముకుంటూ రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు అన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల నుండి వరి ధాన్యం ఐకెపి సెంటర్ల ద్వారా కొనుగోలు చేస్తున్న వాటిలో తాలు పొట్టు మట్టి ఉందని సాకుతో రైతులను ఇబ్బంది పెడుతూ మిల్లర్లు వరి ధాన్యాన్ని దించుకోకుండా వారి రైస్ మిల్లు దగ్గర లారీలను ఆపుకొని రైతులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. వీపనగండ్ల మండలంలోని తూముకుంట ఐకెపి సెంటరును బుధవారం నాడు సందర్శించారు ఈ సందర్భంగా రైతులతో వరి ధాన్యం కొనుగోలుకు జాప్యం జరగడంపై ఆయన వారితో అడిగి తెలుసుకున్నారు ఐకెపి సెంటర్లో ధాన్యం కొనుగోలు జరుగుతుందని వారు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తెచ్చారు అంతేగాక తూకం చేసిన వడ్లల్లో తాలు ఎక్కువగా ఉన్నదని రైస్ మిల్లర్లు వాటిని దింపుకోవడం లేదని ఆయన దృష్టికి తెచ్చారు ఇప్పటికీ నెల కావస్తున్న వడ్లు తూకాలు కావడం లేదని తూకాలు అయినటువంటి వరి ధాన్యం సంచులను లారీలు రాకపోవడంతో కల్లాల్లను మగ్గుతున్నాయని దీనితో ఎండ తీవ్రత వల్ల తరుగు ఏర్పడుతుందని వారు ఆయన దృష్టికి తెచ్చారు దానితో ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఏదైతే క్వింటా ధాన్యం కొనుగోలు చేస్తున్నారో అదనంగా కేజీ నారా ధాన్యాన్ని తూకం చేయడం జరుగుతుందని అలాంటప్పుడు మళ్లీ తరుగు తాలు నెపంతో రైతులను ఇబ్బంది పెట్టడం ఏంటిదని ఆయన అన్నారు రైస్ మిల్లర్లు కావాలని రైతులను ఇబ్బంది పాలు చేస్తున్నారని అయితే రైస్ మిల్లర్లు ఏదైతే రైతుల ద్వారాకాలు అనేటటువంటిది వస్తుందో అది పొట్టులో కొట్టుకొని పోతుంది అని దానిని 60 రూపాయలకు కిలో ప్రకారంగా రైస్ మిల్లర్లు అమ్ముకోవడం జరుగుతుందని వారికి పట్టుకు నూకకు అందులో లావు రకం సన్న రకం ఈ విధంగా అమ్ముకోవడం జరుగుతుంది వారికి లాభాల బాటలో రైస్ మిల్లర్లు ఉన్నారని రైతులను మటకం ముంచుతున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని ఆయన రైతులకు తెలిపారు ఐకెపి సెంటర్లను సందర్శించిన వారిలో గీతా కార్మిక సంఘం నాయకుడు రామచంద్రయ్య గౌడ్ సిఐటియు నాయకులు బాలకృష్ణ ఉన్నారు.

## ఉమ్మడి జిల్లా ఓబిసి ప్రధాన కార్యదర్శిగా రమేష్ యాదవ్ ఎంపిక

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 14 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా హన్వాడ మండలంలోని, గొండ్యాల గ్రామానికి చెందిన రమేష్ యాదవ్ ఎంపికయ్యారు. అందుకు సంబంధించిన నియామాక పత్రాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో రమేష్ యాదవ్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లునర్సింహ్మారెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, టంకరకృష్ణయ్యయాదవ్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, అంజన్నగౌడ్, శేఖర్ యాదవ్, బొక్కి రాములు, గోపాల్ యాదవ్ పాల్గొన్నారు.



రమేష్ యాదవ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

## మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, మే 14 ప్రభాతవార్త :** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నారాయణపేట పట్టణంలోని సరబ్ బజార్ చౌక్ సెంటర్లో 1981,83 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు చలివేంద్రంతో బాటు ప్రతి బుధవారం ప్రజల సౌకర్యార్థం మజ్జిగను పంపిణీ చేయడాన్ని పేట మున్సిపల్ కమిషనర్, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప, పతాంజలి యోగ సమితి జిల్లా కన్వీనర్ సురేష్, రఘువీర్ యాదవ్‌లు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సరబ్ బజార్‌కు వస్తున్న ప్రజలు వేసవి కాలంలో తాగు నీటి దాహాన్ని తీర్చడంతోపాటు ప్రతి బుధవారం మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో బివిఎల్ రెడ్డి,రామకృష్ణ,కళ్యాణి, సత్యనారాయణ,ఆనంద్, నాగభూషణం, దేవన్న,అనిల్ కుమార్‌తో బాటు తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

◆ రైతులు ఇబ్బంది పడకుండా చూడండి

◆ సివిల్ సప్లై డిఎంకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశం

**జడ్చర్ల, మే 14 ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల్లో ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రవినాయక్‌ను జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. నియోజకవర్గంలోని కొన్ని మండలాలలో ధాన్యం కొనుగోళ్ల సక్రమంగా జరగడంలేదనే ఫిర్యాదులు తన దృష్టికి రావడంతో బుధవారం సాయంత్రం ఈ విషయం గురించి ఎమ్మెల్యే సివిల్ సప్లై డీఎంతో ఫోన్‌లో మాట్లాడారు. అన్ని మండలాల్లో కూడా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని,రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటామని అన్ని ప్రాంతాల్లోనూ ధాన్యం కొనుగోళ్ళను వేగవంతం చేస్తామని ఈ సందర్భంగా సివిల్ సప్లై డిఎం రవి నాయక్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, మే 14 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలంలోని షేరుపల్లి గ్రామానికి చెందిన వినోద్‌గౌడ్‌కు రూ.22500ల చెక్కును డా.జిల్లేల చిన్నారెడ్డి గారి ఆదేశాల మేరకు చీర్ల వెంకటేష్ సాగర్ అందించడం జరిగింది. కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చీర్ల వెంకటేష్ సాగర్, శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాముడు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గట్టు యాదవ్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ





బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, మే14 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో మాజీ మంత్రి, బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షుడు డా.సి.లక్ష్మారెడ్డి బుధవారం పర్యటించారు. జడ్చర్ల పట్టణానికి చెందిన శ్రీనివాసులు ఇటీవల మృతి చెందారు. శ్రీనివాసులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన మాజీమంత్రి వర్యులు డా.సి.లక్ష్మారెడ్డి,అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియ జేసారు.అదే విధంగా ఇటీవల అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జడ్చర్ల బిఆర్ఎస్ నాయకులు, మాజీ పట్టణ అధ్యక్షులు దర్శన్ మృతి చెందారు.ఈ మేరకు బుధవారం జడ్చర్ల పట్టణంలోని దర్శన కుటుంబ సభ్యులను మాజీమంత్రి డా.సి.లక్ష్మారెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజే సారు. ధైర్యంగా ఉండాలంటూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు.పార్టీ పరంగా అండగా ఉంటామంటూ భరోసాని ఇచ్చారు. ఆయన వెంట జడ్పీ వైస్ మాజీ చైర్మన్ కోడగల్ యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, సర్పంచ్ ప్రసంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రనిల్ చందర్, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, దేవా,నాయకులు పిట్టల మురళి,నాగిరెడ్డి, శ్రీకాంత్,పర్వత్‌రెడ్డి,సూరి,కరాటే శ్రీను,కొండల్, శంకర్‌నాయక్ ఉన్నారు.

## తెలుగుదేశం పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ

**నారాయణపేట టౌన్, మే14 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను బుధవారం ఆపార్టీ నాయకులు గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నారాయణపేట పట్టణంలోని బిసి కాలనీలో కార్యకర్తలకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా టిడిపి పార్లమెంట్ ఆడహాక్ కమిటీ సభ్యులు రాములుయాదవ్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఓంప్రకాష్ ముదిరాజ్ గోపాల్ యాదవ్‌లు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు ఈ గుర్తింపు కార్డ్ 2 సంవత్సరాలు వర్తిస్తుందని సభత్వం పొందిన కార్యకర్త ఆకస్మికంగా యాక్సిడెంట్ లో మరణించిన వారికి రూ. 5 లక్షల పార్టీ ఆధ్వర్యంలో ప్రమాద భీమా అందించబడునని నిరుపేద కార్యకర్తల పిల్లలకు ఉచితవిద్యకు అయ్యేఖర్చులను పార్టీ భరిస్తుందని అన్నారు. నియోజకవర్గం మండల, పట్టణ కమిటీలను త్వరలో ఎన్నుకుని తెలంగాణలో రాబోయే మున్సిపల్, గ్రామ పంచాయతి ఎన్నికల్లో టిడిపి జెండా ఆవిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యాబన్న,చౌదరి, వడ్డి నారాయణ, కమలమ్మ, ఉషనప్ప, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను అందజేస్తున్న దృశ్యం

## చాగాపురం రెవెన్యూ సదస్సులో 127 భూ సమస్యల కోసం దరఖాస్తులు



చాగాపురంలో రైతుల నుండి భూ సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీనివాసరావు

**ఇటిక్యాల,మే 14 ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న భూసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూభారతి చట్టం తీసుకొచ్చిందని ఈ చట్టం ద్వారా రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా ఇటిక్యాల మండలం పైలట్ ప్రాజెక్టు ఎంపిక కావడంతో బుధవారం 8వ రోజు మండల పరిధిలోని చాగాపురం గ్రామంలో గల రైతు వేదికలో రెవెన్యూ సదస్సు తహసిల్దార్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ సదస్సుకు ఆర్డిఓ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధరణిలో భూ సమస్యల వల్ల రైతుల ఇబ్బందులు పడ్డారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ధరణి స్థానంలో భూభారతి చట్టం అమలు చేస్తున్నారని పైలెట్ ప్రాజెక్టు కావడం వల్ల రెవెన్యూ సదస్సులు గ్రామాలలో ఏర్పాటు చేసి అధికారులు అందరూ గ్రామాలలోకి వచ్చి రైతుల నుండి సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు తీసుకుంటున్నారని కొన్నింటికి ఉచితంగానే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని వీటికి మీ సేవలో చెల్లించే డబ్బులు రైతులకు అదా అవుతాయని రైతులకు వివరించారు. రైతులు ఇచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, విచారించి ఈనెలాఖరు నాటికి భూ సమస్యలను జిల్లా స్థాయిలోనే పరిష్కరిస్తుందన్నారు. కిందిస్థాయి అధికారులు తప్పు చేస్తే కలెక్టర్ వరకు అప్పీల్ కూడా వేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా చాగాపురం రైతు వేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం 127 దరఖాస్తులు రైతుల నుండి స్వీకరించినట్లు తహసిల్దార్ వీరభద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారులు వీరభద్రప్ప, నరేష్, డిప్యూటీ తహసిల్దార్ నందిని, సీనియర్ అసిస్టెంట్లు మనోహర్, నరేష్, ఆర్ఐలు మదన్ మోహన్, గురురాజా, కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## గ్రామ సమైక్యత కోసం గ్రామ దేవతలను ఆరాధించాలి

◆ బీఆర్ఎస్ యువ నేత చించోడు అభిమన్యురెడ్డి



అమ్మవారి పూజలో పాల్గొన్న అభిమన్యురెడ్డి

**రాజాపూర్,మే14 ప్రభాతవార్త:** గ్రామ సమైక్యత కోసంగ్రామ దేవతలను ఆరాధించాలని బీఆర్ఎస్ యువ నేత చించోడు అభిమన్యు రెడ్డి అన్నారు. రాజాపూర్ మండలం చొక్కంపేట గ్రామంలో నిర్వహించిన ఎల్లమ్మ అమ్మవారి పండుగలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. గ్రామ సమైక్యత కోసం గ్రామ దేవతలను ప్రతి ఒక్కరు ఆరాధించాలని ఈ సందర్భం గా ఆయన కోరారు.గ్రామంలో నిర్వహించిన ఎల్లమ్మ పండుగను గ్రామస్తులు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు.చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఎల్లమ్మ పండుగలో ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధల తో పాల్గొని తమతమ మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు,యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## సరస్వతి పుష్కరాలకు పేట నుండి ప్రత్యేక బస్సులు

◆ డిపో మేనేజర్ లావణ్య

**నారాయణపేట టౌన్, మే 14 ప్రభాతవార్త:** సరస్వతి పుష్కరాల సందర్భంగా నారాయణపేట డిపో నుండి కాలేశ్వరం వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ లావణ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ తేది నేటి నుండి ఈ నెల 25 వరకు జరుగుతున్న పుష్కరాలకు నారాయణపేట నుండి కాలేశ్వరం వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సౌకర్యాన్ని నారాయణపేట డిపో, కోస్గి డిపో పరిధిలో గల పట్టణ పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చార్జీల వివరాలు సూపర్ లగ్జరీ బస్సు నారాయణపేట నుండి కాళేశ్వరం వరకు ఒక్కరికి రూపాయలు 1190/, డీలక్స్ బస్సు ఒక్కరికి 1050/, ఎక్స్‌ప్రెస్ బస్సు ఒక్కరికి 910 రూపాయలన్నారు. వివరాల కోసం 7382 826109 సంప్రదించాలని కోరారు.

## ఉత్సాహంగా అండర్ – 19, 23 ఎంపికలు

ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన 60 మంది క్రీడాకారులు



కొనసాగుతున్న ఎంపికలు



**జడ్చర్ల, మే 14 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీలోని డాక్టర్ బి.ఆర్ఆర్ కళాశాలలోని మినీ స్టేడియం వేదికగా ఉమ్మడి జిల్లా సాయి క్రికెట్ ఎంపికలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా స్థాయి అండర్19 అండర్ 23 పోటీలకుగాను జడ్చర్ల మినీ స్టేడియంలో జడ్చర్ల జట్టు ఎంపికలను బుధవారం నిర్వహించారు. ఈ ఎంపికకు జడ్చర్ల, షాద్నగర్ మరియు కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల మున్సిపాలిటీ చైర్ పర్సన్ పుష్పలత నరసింహ మాట్లాడుతూ కష్టపడి ఎంపికైన క్రీడాకారులు రాబోయే ఉమ్మడి జిల్లా పోటీలలో సత్తాచాటి రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల కౌన్సిలర్లు, సతీష్, రమేష్, ఉమాశంకర్, అశోక్ యాదవ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు టిఆర్ఎస్ నాయకులు రామ్మోహన్, కాంగ్రెస్ నాయకులు బాద్మి రవి శంకర్, నరసింహ, ఫ్లైవాక్ అసోసియేషన్ అధ్యక్షులు కాల్వరాంరెడ్డి, ఎండిసిఏ పరిశీలకులు మన్నాన్, సీనియర్ క్రీడాకారులు శ్రీహరి, అన్సారీ, రవి, విజయ్, కోచ్‌లు మోయిన్, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

గద్వాల జిల్లాలో

## ఇతర రాష్ట్రాల వడ్లను అనుమతించవద్దు

◆ అధికారులకు జిల్లా కలెక్టర్ సంతోష్ అదేశాలు



తెలంగాణ, కర్ణాటక చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, మే14, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వచ్చే వరిధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం కేటీదొడ్డి మండలంలోని తెలంగాణ,కర్ణాటక సరిహద్దు చెక్ పోస్టును అదనపు కలెక్టర్ నర్సింగ రావుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల ప్రవేశ,నిష్క్రమణ రిజిస్టర్లను పరిశీలించారు. వాహనాల సమాచారం,వే బిల్లులు, వాహనాలు ఏ రాష్ట్రానికి సంబంధించినవో తదితర వివరాలను స్పష్టంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరిధాన్యాన్ని ఏవిధంగానూ తెలంగాణ రాష్ట్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. అనంతరం నందిన్ని గ్రామంలోని ఐ.కే.పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతుల ధాన్యాన్ని పరిశీలించి, సేకరణ, రవాణా వివరాలు తెలుసుకొని, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. డిజిటల్ తేమ మీటర్ తో ధాన్యం తేమ శాతం పరిశీలించి, 17 తేమ శాతం రాగానే కాంటా వేసి మద్దతు ధరకు కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలనిఆదేశించారు. గన్నీ బ్యాగులు, హమాలీలు, లారీలు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగొన్న వెంటనే ట్యాబు ఎంట్రీ చేసి, రైతులకు చెల్లింపు జరపాలని అధికారులను ఆదేశించారు. తదనంతరం ధాన్యం గోదామును పరిశీలించి,ధాన్యం నిల్వ వ్యవస్థ పక్కాగా ఉండాలని,పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. నిల్వలో ధాన్యం నాణ్యతతో పాటు భద్రతా చర్యలు కూడా తప్పనిసరిగా పాటించాలని స్పష్టంగా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్,సివిల్ సప్లయ్ డీఎం విమల,కే.టీ దొడ్డి తహసీల్దార్ హరి కృష్ణ, సంబంధితఅధికారులు, రైతులు, పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిలర్లకు పంపించాలి : జిల్లా కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, మే 14,ప్రభాతవార్త:** వరిధాన్యం కొనుగోలు చేసిన వెంటనే కేంద్రాల్లో నిల్వ చేయకుండా సంబంధిత మిల్లర్లకు వెంటనే తరలించాల్సిందిగా జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ధరూర్ మండలంలోని ధరూర్, అల్వాలపాడు గ్రామంలోని ఐ.కే.పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నర్సింగ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి,ఇప్పటివరకు ఎంత పరిమాణంలో ధాన్యం సేకరించారు, రైస్ మిల్లులకు ఎంత ధాన్యం తరలించారని తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.కొనుగోలు కేంద్రానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. స్వయంగా డిజిటల్ తేమ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించి,కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17 తేమ శాతం రాగానే కాంటా వేసి మద్దతు ధరకు కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని అన్నారు. గన్నీ బ్యాగుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయ్ డీఎం కు ఆదేశించారు. ధాన్యం రవాణా పనులు ఏ మాత్రం ఆలస్యం కాకుండా ఉండేందుకు అవసరమైన హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ధాన్యం రవాణా కోసం లారీలను తగిన సంఖ్యలో సిద్ధంగా ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వెంటనే ట్యాబు ఎంట్రీ పూర్తి చేసి,రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎం కు సూచించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అన్ని వివరాలు రిజిస్టర్‌లో పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్,సివిల్ సప్లయ్ డీఎం విమల, ధరూర్ తహసీల్దార్ భూపాల్ రెడ్డి,సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వంగూరు, మే14 ప్రభాతవార్త:** వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులతో రైతు కమిషన్ సభ్యులు కేవీ నరసింహారెడ్డి, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామంలోని 2 వరుసల రహదారి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పాలశీతలీకరణ నూతన భవనం నిర్మాణ పనులు, గ్రామంలో ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించే పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామంలో సీసీరోడ్డుల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను, రహదారి వెంట వీధి ధీపాలను ఏర్పాటు చేయాలని,మిషన్ భగీరథ ద్వారా గ్రామంలో త్రాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని, చిన్న పిల్లల పార్క్,ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత సమయంలో గ్రామంలోని అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అంతకుముందు గ్రామంలో రైతు కమిషన్ సభ్యులు కేవీ నరసింహారెడ్డి,జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు.ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు, గ్రామ ప్రత్యేక అధికారి విజయ్‌కుమార్, ఆర్అండ్‌బి అధికారులు దేశ్యానాయక్, నాగలక్ష్మి, విద్యుత్ అధికారులు పాల్ రాజు, మిషన్ భగీరథ అధికారులు సుధాకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అగచాట్లను పట్టించుకోని సర్కార్

తడిసిన, కొట్టుకుపోయిన ధాన్యంకు పరిహారం ఇవ్వాలి : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మే 14 ప్రభాతవార్త:** రైతులంతా అగచాట్లకు గురైతుంటే రాష్ట్ర సర్కార్ అందాల పోటీలపై శ్రద్ధ పెడుతుందని మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వడ్ల కొనుగోలు విషయంలో రైతులు పడుతున్న ఇబ్బందులను వదిలేసి, అందాల పోటీలపై రాష్ట్ర సర్కార్ శ్రద్ధ చూపడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులకు సర్కార్ ఇచ్చిన అనేక హామీల మాట నిలబెట్టుకోవడంలో విఫలం అయినా కష్టపడి పంట సాగు చేశారని,చివరకు కొనే దగ్గర రైతంగాం అనేక రకాల అవస్థలకు గురవుతున్నారని పేర్కొన్నారు. కొనుగోలు విషయంలో ప్రతిరోజు రైతులు ధర్నా చేస్తు రోడ్లపైకి వస్తున్న ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని గుర్తుచేశారు. ధాన్యం కాంట వేయడానికి, వేసిన దానిని మిల్లులకు తరలించడానికి రోజుల తరబడి సమయం పడుతుందని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు తరలించడంలో ట్రాన్స్‌పోర్ట్ చాలా కీలకమని, బిఆర్ఎస్ హాయంలో ట్రాన్స్ పోర్ట్ టెండర్‌లు పారదర్శకంగా నిర్వహించామన్నారు. కిందమీద పడి మిల్లులకు ధాన్యం వెళితే మిల్లర్లు చెప్పి మరీ తరుగు తీస్తున్నారని, వారి మీద ప్రభుత్వానికి నియంత్రణ లేక ప్రత్యక్షంగా దోపిడీ గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు రైతులు ఇబ్బందుల పైన ఒక్కనాడు సమీక్షించి సాంత్వన కల్పించిన దాఖలాలు లేవని అన్నారు. తక్షణమే తడిసిన, కొట్టుకుపోయిన ధాన్యం కు రైతంగానికి పరిహారం కట్టించాలి డిమాండ్ చేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

**నవాబుపేట,మే 14 ప్రభాతవార్త:** బుధవారం డ్రింక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి నాలుగు రోజుల జైలుశిక్ష కోర్టు విధించింది. పాశం నరేష్ నుతిపల్లి గ్రామము నందిపేట్ మండలం నిజామాబాద్ జిల్లా ప్రస్తుతము తాళ్లగడ్డ గ్రామము మూసాపేట్ మండలంకు చెందిన వ్యక్తి మద్యం త్రాగి తన మోటార్ సైకిల్ నడుపుతుండగా నవాబుపేట ఎస్సై విక్రమ్ ఈనెల 2వ తేదీ నాడు నవాబ్‌పేట్ అంబేద్కర్ చౌరస్తాలో తనిఖీలు చేస్తుండగా మద్యం సేవించివాహనం నడుపుతూ పట్టుబడ్డాడు.బుధవారం ఎస్సై విక్రమ్ ఆదేశాల మేరకు రాజుగౌడ్ కోర్ట్ కానిస్టేబుల్ మహబూబ్‌నగర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అయిన శశిధర్ పాశం నరష్‌కు 2 రోజుల జైలు శిక్ష రూ. 5000ల జరిమానా విధించగా జరిమాన కట్టనందున మరొక రోజు పెంచి మొత్తం 3 రోజుల జైలు శిక్ష విధించారు.

## పాము కాటుతో వృద్ధురాలు మృతి



మృతి చెందిన మల్లమ్మకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి

**అయిజ. మే14, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం మల్లమ్మ అనే అనాదా వృద్ధురాలు పాము కాటుకు గురి అయ్యి మృతి చెందింది గ్రామస్తుల వివరాల ప్రకారం ఆమె అనాధగా గత 20 సంవత్సరాల నుంచి జీవనం కొనసాగిస్తూ ఉండేదని అకస్మాత్తుగా ఇలా పాము కాటుకు గురై చనిపోవడం జరిగిందన్నారు ఆమె అంతక్రియలు చేయడానికి కూడా ఎవరూ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శి స్వాతి గ్రామ ప్రజలతో కలిసి ఆమె అంత్యక్రియలు నిర్వహించారు దీంతో పంచాయతీ కార్యదర్శిని గ్రామ ప్రజలు ప్రశంసించారు.

## చౌడేశ్వరి మాత అందరినీ చల్లగా చూడాలి

◆ పాల్కొండ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

◆ అమ్మవారికి పూజలు నిర్వహించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, ఆనంద్‌గౌడ్

**మహబూబ్‌నగర్ మే 14, ప్రభాతవార్త:** చౌడేశ్వరి మాత అందరినీ చల్లగా చూడాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్ పట్టణంలో కొలువైన చౌడేశ్వరి మాత ఆలయ వార్షిక ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా పాల్కొండ గ్రామ శివారులోని పోచమ్మ అమ్మవారి బోనాల సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌తో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికిప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థజిల్లాచైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఎరుకల శ్రీను, పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, గోపాల్, నరేందర్, వెంటకరాములు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## రూ.లక్షకు రూ.5వేలు ఇవ్వాల్సిందే..

◆ ఆర్‌పీల చేతివాటం

◆ జడ్చర్ల మున్సిపాలిటీలో మెప్మా సిబ్బంది తీరు

◆ ప్రభుత్వాలు మారినా.. మారని అధికారుల తీరు



ఫైల్

**జడ్చర్ల, మే 14, ప్రభాతవార్త:** పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇవ్వడం కోసం ఏర్పాటు చేసిన మెప్మా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లిలో 23మంది ఆర్.పిలను నియమించినది. మహిళా సంఘాలకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించేందుకుగానూ ఈసదరు ఆర్.పిలు లోన్లు ఇప్పించి లక్షల్లో లంచాలు లాగుతున్నారు. నిరుపేదలైన మహిళలు స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకుని ఆర్.పిల ద్వారా రుణాలు మంజూరు చేయాలని వాళ్ల ఇండ్ల చుట్టూ తిరుగుతూ ఉంటే లక్షకు 5000 లేదా కోటి రూపాయల లోన్ కు ఒక రేట్ ఫిక్స్ చేసి డబ్బు వసూలు చేస్తున్నారు. మహిళా సాధికారత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెప్మా ఉద్దేశం నీరుగారిపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆర్.పిలకు నెలకు రూ.6000 జీతంతో పాటు రూ.1500 గౌరవ వేతనం గా మహిళా సంఘాల నుండి అందిస్తున్నారు. ఇవి సరి పోవంటూ మళ్లీ కోట్ల రూపాయల మహిళా సంఘాలకు ఇప్పించే రుణాల కోసం ఆమ్యామ్యాలకు ఆశపడుతున్నారు.ఆర్.పిల పై అధికారులు టౌన్ మిషన్ కో ఆర్డినేటర్, జిల్లా మిషన్ కో ఆర్డినేటర్‌లకు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యం అంటున్నారు. ప్రభుత్వం మారిన ఆర్‌పిల తీరు మారడం లేదని మహిళా పొదుపు సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

## ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలి

■ సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణ, నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించాలి

■ వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



అవగాహన కార్యక్రమానికి హాజరైన జిల్లా పోలీసు యంత్రాంగం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి క్రైమ్, మే14 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లాలో వివిధ పోలీస్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో ఉన్న సమయంలో క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ, మంచి టర్న్ అవుట్ తో అప్పగించిన విధులు గర్వంగా నిబద్ధతతో నిర్వహించమన్నారు. క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని వివరించారు.విధులు పరంగా ఎలాంటి సమస్యలుతలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నీతి,నిజాయితీతో పనిచేసే వారికి పోలీస్ శాఖలో ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. ఏదైనా పిర్యాదు వస్తే వారిని ఎక్కువసేపు వెయిట్ చేయించకుండా వారి బాధలను తెలుసుకొని వారి దగ్గర నుండి సమాచారం తీసుకుని వారి ఫోన్ నెంబర్ ని కూడా తీసుకొని ఎస్సై లేనియెడల వారిని తక్షణమే పంపాలని తెలిజేసారు.వచ్చిన ప్రతి పిర్యాడుదారులతో మర్యాదగా మాట్లాడటం ద్వారా చిన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. పోలీస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల ద్వారా ఇన్ఫర్మేషన్ సిస్టంను డెవలప్ చేసుకోవాలని తెలియజేసారు. వనపర్తి పోలీస్ మీ పోలీస్ అనే నినాదంతో ప్రతి మాటలోనూ ప్రతి పనిలోనూ ప్రతి అడుగులోను మన పోలీస్ సిబ్బంది చూపించాలని అన్నారు అసాంఘిక, చట్ట వ్యతిరేక పనులు చేసేవారిపైన చట్ట పరమైన శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేసారు.ప్రజలతో గ్రామ పెద్ద మనుసులతో దగ్గరయ్యి గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించాలని సూచించారు. పెట్రోలింగ్ రాత్రిపూట ఎక్కువగా చేస్తూ దొంగతనాలు జరుగకుండా చూడాలన్నారు. పాత నేరస్తులను యొక్క పనులపై ఒక కంట కనిపెడుతూ ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. మైనర్ డ్రైవింగ్ మీద స్పెషల్ చేపట్టి సోమవారం.వారి తల్లిదండ్రులకు వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డి ఎస్పీ, ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి సీఐ, కృష్ణ, కొత్తకోట సీఐ, రాంబాబు,ఆత్మకూరు సీఐ శివకుమార్,రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, అప్పల నాయుడు శ్రీనివాస్ మరియు జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.